




వన్యప్రాణుల నుంచి పంటలు కాపాడుకునేందుకు రైతులు.. అడవి జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు.. వీరు పొలాల వద్ద వేస్తున్న కరెంటు ఉచ్చుకు అమాయకులు బలవుతున్నారు. కరెంటు తీగలు లాగిన విషయం తెలియక.. అటుగా వెళ్లి విద్యుదాఘాతానికి గురవుతున్నారు. అటవీ సమీప ప్రాంతాల్లో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

- పుంగనూరు

మృత్యుపాశాలు

- వన్యప్రాణుల కోసం వేటగాళ్లు.. పంటల రక్షణకు రైతులు
- పొలాల చుట్టూ లాగుతున్న కరెంటు తీగలు
- తెలియక అటువెళ్లి బలవుతున్న అమాయకులు

పొలాల వద్ద రైతులు, వేటగాళ్లు తీస్తున్న కరెంటు తీగలు అమాయకులను బలితీసుకుంటున్నాయి. రాత్రివేళల్లో రహస్యంగా కరెంటు తీసి ఉదయాన్నే ఎవరికీ తెలియకుండా ఆ తీగలను తొలగిస్తుంటారు. కానీ అర్ధరాత్రి సమయంలో కరెంటు తీగల విషయం తెలియని వ్యక్తులు ఏదైనా కారణంతో అటుగా వెళ్లినప్పుడు వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. పొలాల చుట్టూ కరెంట్ తీయడం చట్టరీత్యా నేరం. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ అధికారులు చెబుతున్నా.. ఇలాంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. రైతులు ఎంతో కష్టపడి పంటలు సాగు చేస్తున్నారు. అటవీ సమీప ప్రాంతాల్లోని వరి, వేరుశనగ, టమోటా, పండ్ల తోటల్లో రాత్రివేళ వన్యప్రాణాలు చొరబడి నాశనం చేస్తున్నాయి. అడవి పందులు, ఏనుగులు, ఎలుగుబంట్లు తదితర జంతువులు పంటలను ధ్వంసం చేసి రైతులకు కష్టనష్టాలు మిగిలిస్తున్నాయి. ఇక, వాణిజ్య పంటలకు దొంగల బెడద కూడా ఉంటోంది. ఈ క్రమంలో పంటలను కాపాడుకోవాలని రైతులు స్లీవ్‌లేని వైరుకు కరెంట్ కనెక్షన్ ఇచ్చి గూటాలకు వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. మనుషులైనా, జంతువులైనా రాత్రివేళల్లో ఆ కరెంట్ వైరుకు తగిలితే విద్యుదాఘాతంతో అక్కడికక్కడే అసువులు బాయాల్సిందే. కొన్ని ప్రాంతాల్లో తమ పంట పొలాల్లోకి వన్యప్రాణులు రాకుండా రైతు కుటుంబీకులు రాత్రిళ్లు అగ్గిమంటలు వేసుకుని కాపలా కాస్తుంటారు. మరికొందరు కరెంట్ తీగలు ఏర్పాటు చేసి అటుగా ఎవరినీ రాకుండా అక్కడే ఉండి హెచ్చరిస్తుంటారు. ఇంకొందరు అటవీ ప్రాంతాల్లోని పొలాలవద్ద కరెంట్ లాగి.. తెల్లవారుజామున వచ్చి తీగలు తొలగిస్తుంటారు. ఇలా కరెంటు తీగలు లాగిన విషయం తెలియని వారు రాత్రివేళ అటుగా వెళ్లి మృతిచెందుతున్నారు.

జంతువుల కోసం ఉచ్చు

అడవిపందులు, దుప్పులు, జింకలు, నెమళ్ల తదితర జంతువుల కోసం రాత్రి వేళల్లో వేటగాళ్లు కరెంట్ తీగలు అమర్చుతున్నారు. కరెంటు తీగల ఉచ్చులో పడి జంతువులు చనిపోతే ఎవరికీ తెలియకుండా తీసుకెళ్లిపోతుంటారు. ఒకవేళ పట్టుబడితే.. చనిపోయిన వన్యప్రాణులను బట్టి అటవీశాఖ అధికారులు నాన్‌బెయిల్‌బుల్.. బెయిల్‌బుల్.. అపరాధరుసుం చెల్లించే కేసులను నమోదు చేసి బాధ్యులైన వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపుతారు. కరెంట్‌తో ప్రాణాలు తీసిన ఘటనలపై విద్యుత్‌శాఖ అధికారులు కూడా కేసులు పెడతారు. మరోవైపు మనుషులు చనిపోతే పోలీసులు కేసులు పెట్టి నిందితులను అరెస్టు చేస్తారు. ఇలా కరెంట్ తీయడం తప్పు, కఠిన చర్యలు ఉంటాయని తెలిసినా ఈ పనులు సాధారణంగా చాలా చోట్ల జరుగుతున్నాయి.

విద్యుత్తు ప్రమాద ఘటనలో ఐదుగురికి రిమాండ్

సోమల మండలం దేవళకుప్పం వద్ద మామిడితోటకు లాగిన విద్యుత్తు తీగలు తగిలి.. ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై మృతుడు గంగాధరం అలియాస్ గణపతి భార్య నాగవేణి ఫిర్యాదుతో శేషాద్రి నాయుడు, సుందరనాయుడు, మల్లికార్జున నాయుడు, చంద్రానాయుడు, నాయుడును అరెస్టు చేసి, పుంగనూరు కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు 14 రోజుల రిమాండు విధించినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు.

- సోమల

ఎందరో అమాయకుల బలి

- సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ దేవళకుప్పం వద్ద గల యానాదివాడకు చెందిన గంగాధరం(గణపతి), సిద్దప్ప, ఈశ్వరయ్య తప్పిపోయిన గొర్రెలను వెతకడానికి బుధవారం అడవిలోకి వెళ్లారు. శేషాద్రినాయుడు మామిడితోటలో అడవిపందుల కోసం తీసిన కరెంట్‌తీగలు తగలి గంగాధరం అక్కడికక్కడే మృతి చెందగా అతన్ని కాపాడే ప్రయత్నంలో శిద్దప్ప తీవ్రంగా గాయపడ్డారు. మృతుడికి మూడునెలల కిందట వివాహమైంది.
- సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లె వద్ద 2021 మే నెలలో వ్యవసాయ పొలాల వద్ద అడవిపందుల కోసం వేటగాళ్లు తీసిన విద్యుత్ తీగలు తగలి రైతు సుబ్రహ్మణ్యం మృతి చెందారు.
- చౌడేపల్లె మండలం శెట్టిపేట పంచాయతీ ఎర్రగానిపల్లె వద్ద ఇద్దరు యానాదులు అడవికిపోగా కరెంట్ తీగలు తగిలి మృతి చెందారు.మృతదేహాలను బండరాయితో కట్టి బావిలో పడేశారు.
- వేటగాళ్లు కరెంట్ తీగలతో పాటు అడవిపందుల కోసం భూమిలో నాటు బాంబులు పూడ్చుతున్నారు. చౌడేపల్లె మండలం రాజనాలబండ అడవి, ముదిరెడ్డిపల్లె, మడుకూరు,చుక్కావారిపల్లె, మేకలచిన్నేపల్లె, పుంగనూరు, సదుం, సోమల, పులిచెర్ల మండలాల్లోని అటవీప్రాంతాల్లో వేటగాళ్లు వివిధ రకాలుగా జంతువులను చంపుతున్నారు. ఈవిషయంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి కరెంట్‌తీగలు పొలాల వద్ద ఏర్పాటు చేయకుండా కట్టడి చేయాలి. మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



రామానాయుడుపల్లె వద్ద సభ కోసం జరుగుతున్న పనులు - సభా స్థలి వద్ద టీడీపీ నేతల చర్చలు

జోరుగా 'రా.. కదలిరా' సభ ఏర్పాట్లు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 3: గంగాధర నెల్లూరు పంచాయతీ రామానాయుడుపల్లె బస్టాప్ వద్ద ఈనెల 6వ తేదీన జరగనున్న రా.. కదలిరా బహిరంగ సభకు మాజీ సీఎం చంద్రబాబు హాజరుకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సభ కోసం ఏర్పాట్లు జోరందుకున్నాయి. శుక్రవారానికే స్థలాన్నంతా శుభ్రం చేసేశారు. వేదిక పరిసరాలతోపాటు రోడ్డుకు అవతలివైపు హెలిప్యాడ్ కోసం సిద్ధం చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా ద్విచక్రవాహనాలు నిలిపేలా, మరోచోట నాలుగుచక్రాల వాహనాలు ఉంచేలా పనులు ఊపందుకున్నాయి. శనివారం తెల్లవారు జాము నుంచే పనులు జరుగుతున్నాయి. మరోవైపు జరుగుతున్న పనులను పరిశీలించడానికి వస్తున్న టీడీపీ నేతల తాకిడి రోజు రోజుకూ పెరుగుతోంది. శనివారం వచ్చిన నాయకుల్లో నరసింహయాదవ్, భీమనేని చిట్టిబాబునాయుడు, ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, వెంకటేష్, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, దేవసుందరం, స్వామిదాస్, కోదండరెడ్డి, కేతినేని లోకేష్‌నాయుడు, హరిబాబునాయుడు, గుండయ్య, బెంగుళూరుకు చెందిన లాయర్ నాగరాజులునాయుడు, ఆంజినేయులుశెట్టి, మునిరత్నంనాయుడు, మునిరాజులుయాదవ్, నెల్లేపల్లె సుబ్రమణ్యం, గిరిబాబునాయుడు, భాస్కర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, క్రిష్ణమూర్తినాయుడు, సిద్దయ్యశెట్టి తదితరులున్నారు.

అలా.. ముగించారు

- ఘర్షణలు, ధర్నాలు, వాగ్వాదాల నడుమ జిల్లాలో ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు
- తొలి రోజు నుంచే మొక్కుబడిగా నిర్వహణ

చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 3: ఆడుదాం ఆంధ్రా క్రీడా క్రీడా పోటీలు జిల్లాలో శనివారంతో ముగిశాయి. తొలి రోజు నుంచే మొక్కుబడిగా నిర్వహణ సాగింది. పలుచోట్ల ఘర్షణలు, ధర్నాలు, పరస్పర ఫిర్యాదులు, వాగ్వాదాలు వంటివి చోటు చేసుకున్నాయి. క్రీడలపై కనీస అవగాహన లేని వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులకు నిర్వహణ బాధ్యత అప్పగించడంపైనా విమర్శలొచ్చాయి. నాసిరకం కిట్లు ఇవ్వడంతోపాటు నిబంధనలూ పాటించలేదని, పార్టీ కార్యక్రమాన్ని తలపించేలా మైదానాలను ఫ్లెక్సీలు, బ్యానర్లతో నింపేశారన్న ఆరోపణల మధ్య జిల్లా స్థాయి పోటీలనూ ముగించారు. చిత్తూరులోని మెసానికల్ మైదానంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో బాగా ఆడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రవిదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, ఆర్డీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్‌లో విజేతగా నిలిచిన జీడీనెల్లూరు పురుషుల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జేసీ శ్రీనివాసులు తదితరులు

ఎక్కడెలా..

- బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లి హైస్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో క్రీడాకారుల మధ్య ఘర్షణ చెలరేగి కుర్చీలతో కొట్టుకున్నారు.
- పెనుమూరు మండలంలో జరిగిన కబడ్డీ పోటీల్లోనూ గొడవ జరిగింది. రిజిస్ట్రేషన్ చేసుకోని క్రీడాకారులు ఉన్నారంటూ మ్యాచ్‌ను రద్దు చేయాలని సీఆర్ కండ్రిగ జట్టు రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేశారు. క్రికెట్ పోటీల్లోనూ గందరగోళం చోటుచేసుకుంది. ఆర్‌కేపురం జట్టులో తొమ్మిది మంది క్రీడాకారులతోనే మ్యాచ్ ఆడించారు.
- పూతలపట్టు మండలంలో టీడీపీ సానుభూతిపరులనే నెపంతో క్రీడాకారులను వెనక్కి పంపించేశారు. దీనిపై వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.
- చిత్తూరు మెసానికల్ మైదానంలో శుక్రవారం జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో అంపైర్ల నిర్ణయంపై అధికారులతో వాగ్వాదం చేస్తున్న జీడీ నెల్లూరు క్రీడాకారులు.

ప్రాంతాలవారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలిలా..

- ఖోఖో.. పురుషుల విభాగంలో పలమనేరు, పూతలపట్టు, కుప్పం, మహిళల విభాగంలో పూతలపట్టు, పలమనేరు, జీడీనెల్లూరు.
- కబడ్డీ.. పురుషుల విభాగంలో నగరి, జీడీనెల్లూరు, పూతలపట్టు, మహిళల విభాగంలో చిత్తూరు, పలమనేరు, జీడీనెల్లూరు.
- వాలీబాల్... పురుషుల విభాగంలో చిత్తూరు, పుంగనూరు, జీడీనెల్లూరు, మహిళ విభాగంలో.. పలమనేరు, పూతలపట్టు, నగరి.
- బాడ్మింటన్... పురుషుల విభాగంలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, మహిళా విభాగంలో చిత్తూరు, జీడీనెల్లూరు, పుంగనూరు.
- క్రికెట్.. పురుషుల విభాగంలో జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, మహిళ విభాగంలో పలమనేరు, జీడీనెల్లూరు, పుంగనూరు.

మెగా కాదు.. దగా డీఎస్సీ

మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి 3: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. శనివారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ వదిలింది మెగా డీఎస్సీ కాదని, అది ఒక దగా డీఎస్సీ అని అభివర్ణించారు. రాష్ట్రంలో 50,892 పోస్టులు ఖాళీ ఉంటే కేవలం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమే అన్నారు. జనవరి ఒకటో తేదీనే జాబ్ క్యాలెండరు విడుదల చేస్తానని గతంలో హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లుగా ఆయన చేసిందేమీ లేదన్నారు. మరోవైపు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లేలా మంత్రి బొత్స, కల్లబొల్లి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు రాష్ట్రంలోనే ఉండటం వైసీపీ అరాచక పాలనకు నిదర్శనమన్నారు. ఇలాంటి ఆర్థిక నేరస్తుడికి ఓటు అనే ఆయుధంతో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

ఎండీయూ వాహన ఆపరేటర్లు 33మందికి జీతాల నిలుపుదల

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ఎండీయూ వాహన ఆపరేటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 33మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా 5.41లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు, వారి సహాయకులకు రూ.3వేల జీతం ప్రభుత్వ చెల్లిస్తోంది. కాగా, జనవరిలో కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 33మంది జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ డీఎస్‌వో కార్యాలయం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

చిరిగిన నోట్లిచ్చారు

- ఆవేదనలో సామాజిక పింఛనుదారులు



చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 3: చిత్తూరులో వలంటీర్లు పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్ల నగదులో ఎక్కువ భాగం చిరిగిన నోట్లే ఉన్నాయి. వీటిని ఎలా మార్చుకోవాలని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరిగిన నోట్ల విషయమై వివరణ కోరడానికి డీఆర్‌డీఏ పీడీ తులసిని ఫోన్లో సంప్రదించగా, ఆమె అందుబాటులోకి రాలేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వచ్చే నెల నుంచైనా ఇలాంటి నోట్లు లేకుండా చూడాలని పింఛనుదారులు కోరుతున్నారు.

గంగినేనిచెరువులో జింక మృతి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 3: చిత్తూరు గంగినేనిచెరువులో జింక మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. స్థానిక నగరవనంలోని జింక.. కుక్కల దాడిలో గాయపడి, చెరువులో పడి మృతి చెందినట్లు ఎఫ్‌ఆర్వో థామస్ తెలిపారు. కళేబరానికి పంచనామా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.





పలమనేరులో టీడీపీ తీర్థం పుచ్చుకున్న కార్యకర్తలు

కండువాలు మారిపోయాయ్!

ఉదయం టీడీపీలో.. సాయంత్రం వైసీపీలో

వి.కోట, ఫిబ్రవరి 3: వి.కోట మండలం సుద్దులకుప్పంకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు కొందరు మాజీ మంత్రి అమరనాథరెడ్డిని కలుసుకుని, స్థానిక టీడీపీ నేతల సమక్షంలో శుక్రవారం ఉదయం పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ఆ తర్వాత జరగాల్సిన తతంగం జోరుగా సాగింది. సాయంత్రం ఇదే కార్యకర్తలు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఇంటి వద్దకు చేరుకుని, ఆ తర్వాత వైసీపీ కండువాలతో కనిపించారు. ఎన్నికల వేళ ఇంకెన్ని ఇటువంటివి చూడాలో అని జనం నవ్వుకుంటున్నారు.



తోటకనుమలో వైసీపీ కండువాలతో దర్శనమిచ్చిన సుద్దులకుప్పం కార్యకర్తలు

ఉద్యోగులందరికీ ఇంకా జీతాలు పడలే..!

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలిస్తారు. నెల ప్రారంభమై.. మూడ్రోజులు గడిచినా ఇంకా 60 శాతం మందికి జీతాలు అందలేదు. రెవెన్యూ, పోలీసు, వైద్య, ఆరోగ్య, న్యాయ విభాగ అధికారులకు శుక్రవారం, ఖజానా ఉద్యోగులకు శనివారం జీతాలు పడ్డాయి. జిల్లావ్యాప్తంగా 22,748 మంది ఉద్యోగులు వివిధశాఖల్లో పనిచేస్తుండగా, వీరికి జీతాల రూపేణ ప్రభుత్వం రూ.113.74 కోట్లు ప్రతినెలా చెల్లిస్తుంది.

పెన్షనర్లవీ ఎదురుచూపులే..

12,505 మంది పెన్షనర్లకు కూడా ఎదురుచూపులే మిగిలాయి. ఇప్పటివరకు ఒక్కరికి కూడా పెన్షన్ సొమ్ము అందలేదు. వీరికి నెలకు రూ.62.52 కోట్లను పెన్షన్ రూపేణా ప్రభుత్వం చెల్లిస్తోంది. 4న ఆదివారం, 5న సోమవారం జీతాలు పడే అవకాశం లేదు. 6న సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రూ.4,000 కోట్లు జమయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత ఏడు లేదా ఎనిమిదో తేదీల్లో మాత్రమే ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు వేతనాలు, పెన్షన్లు పడతాయని ఖజానాశాఖ అధికారులు భావిస్తున్నారు.

బరుగూరు సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా

డ్రైవర్, ప్రయాణికులకు స్వల్ప గాయాలు



బరుగూరు సరిహద్దులో బోల్తాపడిన బస్సు

కుప్పం, ఫిబ్రవరి 3: కుప్పం నుంచి తమిళనాడు రాష్ట్రం బరుగూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు శనివారం ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కుప్పం నుంచి సుమారు 20 మంది ప్రయాణికులతో బరుగూరుకు ఆర్టీసీ బస్సు బయల్దేరింది. తెల్లవారుజామున 5.30 గంటలకు పొగమంచు కమ్మేయడంతో కనుమూరు దాటాక మలుపులో అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ సెల్వరాజ్, కొంతమంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు గమనించి బాధితులను బయటకు తీసి, ఆస్పత్రికి తరలించారు. తమిళనాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలం చెల్లిన బస్సులతో ప్రమాదాలు : టీడీపీ

'టీడీపీ హయాంలో చంద్రబాబు.. కుప్పం డిపోకు తీసుకొచ్చిన కొత్త బస్సులను ఇటీవల పుంగనూరుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తరలించారు. దీనివల్ల డొక్కు బస్సులను ఇక్కడ నడుపుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి' అని టీడీపీ నేత కనకరాజ్ ఆరోపించారు. దీనికి నిదర్శనమే ఈ ప్రమాదమని చెప్పుకొచ్చారు. కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులతో చెలగాటం ఆడటం మాని.. ఇప్పటికైనా కుప్పం డిపోకు కొత్త బస్సులు వేయాలని ఆయన డిమాండు చేశారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు



ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 3 : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఈనెల 5నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో జనరల్ విభాగంలో(సీనియర్ ఇంటర్) 22,454మంది, ఒకేషనల్ విభాగంలో(ప్రథమ, ద్వితీయ) 2,353మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. ఉదయం 9-12, మధ్యాహ్నం 2-5గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించే ఈ పరీక్షలకు జనరల్‌లో 120, ఒకేషనల్‌లో 22 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 5నుంచి 20వ తేదీ వరకు ఒక్కో స్పెల్‌లో ఐదు రోజుల చొప్పున మూడు స్పెల్స్‌లో ఒకేషనల్ పరీక్షలు, ఇదేనెల 11నుంచి 20వ తేదీ వరకు రెండు స్పెల్స్‌లో జనరల్ కోర్సులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చేశారు : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్ రోడ్), ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చేశారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో వనరులు అన్ని దోపీడికి గురయ్యాయని తెలిపారు. అరాచకం రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. టీడీపీ రాష్ట్రానికి కంపెనీలు, పెట్టుబడులు తీసుకువస్తే జగన్ గంజాయి తెచ్చాడని విమర్శించారు. తిరుపతిలో యువత విచ్చలవిడిగా గంజాయి తాగుతున్నారని, ఎమ్మెల్యే గంజాయిపై నగరం మొత్తం కలియదిరిగి ఏమి సాధించారో చెప్పాలని ప్రశ్నించారు. ఇటీవల తిరుపతిలో హత్యలన్నీ గంజాయి మత్తులో జరిగినవేనని ఆరోపించారు. గంజాయి స్మగ్లింగ్‌లో పోలీసులు కూడా భాగస్వామ్యం కావడం సిగ్గుచేటన్నారు. 22 కిలోల గంజాయితో కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ పట్టుబడడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వూకా విజయకుమార్, శ్రీధర్‌వర్మ, యశ్వంత్‌రెడ్డి, జగన్నాథం, రాజయ్య, మనోహర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ముతో ఉడాయించిన వలంటీరు!

గ్రామస్తుల నిరసనతో డబ్బిచ్చిన కుటుంబీకులు



శనివారం పింఛనుదారులకు నగదు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

గుడుపల్లె, ఫిబ్రవరి 3: పింఛను సొమ్ముతో ఓ వలంటీరు ఉడాయించాడని అధికారుల దృష్టికి పింఛనుదారులు తీసుకెళ్లారు. ఆపై నిరసనకు దిగారు. దాంతో నిందితుడి కుటుంబీకులు ఆ డబ్బులు తీసుకొచ్చి ఇచ్చారు. అయితే వలంటీరుకు ఆరోగ్యం సరిగా లేక పంపిణీ ఆలస్యమైందని ఎంపీడీవో చెబుతున్నారు. ఈ సంఘటన గుడుపల్లె మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ కప్పలనత్తం గ్రామంలో జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కప్పలనత్తం గ్రామంలో వలంటీరు హరీష్.. 38 మంది పింఛనుదారులకు సంబంధించిన రూ.1,05,000ను జనవరి 31వ తేదీన సచివాలయ కార్యదర్శి దగ్గర తీసుకున్నాడు. ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం నుంచే ఈ సొమ్మును పింఛనుదారులకు పంపిణీ చేయాలి. ఉదయం 10 గంటలు దాటినా సొమ్ము అందక పోవడంతో పింఛనుదారులంతా వలంటీరు ఇంటికి వెళ్లారు. పింఛను ఎందుకు ఇవ్వలేదని వలంటీరును అడిగితే అధికారులు డబ్బులివ్వలేదని, సాయంత్రం ఇచ్చాక అందజేస్తానని చెప్పాడు. ఫిబ్రవరి రెండో తేదీ మధ్యాహ్నం అవుతున్నా పింఛను సొమ్ము అందక పోవడంతో పింఛనుదారులు సచివాలయానికి వెళ్లి సర్పంచ్ రీటా ఎల్లప్పకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ వెంటనే ఎంపీడీవో తాజ్ మస్రూర్‌కు తెలిపారు. ఎంపీడీవో.. శెట్టిపల్లె సచివాలయానికి రాగా, వలంటీరుపై పింఛనుదారులు ఫిర్యాదు చేశారు. సాయంత్రంలోపు పింఛను సొమ్ము అందజేయాలని సచివాలయ సిబ్బందికి చెప్పి ఎంపీడీవో వెళ్లిపోయారు. అయినా సొమ్ము పంపిణీ జరగక పోవడంతో శనివారం ఉదయం పింఛనుదారులంతా వలంటీరు ఇంటికి వెళ్లగా అతడి జాడ లేదు. సెల్‌ఫోన్ కూడా పనిచేయలేదు. కుటుంబ సభ్యులను అడిగితే వారు తమకు తెలియదన్నారు. దాంతో తమ డబ్బుతో వలంటీరు ఉడాయించాడని నిర్ధారణకు వచ్చి, రోడ్డుపై నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న వలంటీరు కుటుంబీకులు ఆ డబ్బును తీసుకొచ్చి సచివాలయ సిబ్బందికి అందజేశారు. వారు పింఛనుదారులకు పంపిణీ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో తాజ్ మస్రూర్‌కు వివరణ కోరగా.. వలంటీరుకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పెన్షన్ పంపిణీ ఆలస్యం అయ్యిందని తెలిపారు.

యానాది కాలనీలో ఇసుకదందా

అడ్డుకున్న గ్రామస్థులు



ఇసుక తవ్వకాలు జరుపుతున్న కూలీలు - గ్రామస్తులు అడ్డుకున్న ట్రాక్టర్లు

రామకుప్పం, ఫిబ్రవరి 3: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ ముద్దనపల్లె బీట్ గడ్డూరు యానాదికాలనీ అటవీప్రాంతంలో అధికారపార్టీ ప్రజాప్రతినిధి ఇసుక దందాను యానాదికాలనీ, గోవిందరాజపురం, వినాయకపురం గ్రామస్థులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. వారి కథనం మేరకు ... మూడు నెలలుగా అధికారపార్టీకి చెందిన ఓ నేత, ఓ ఎంపీటీసీ ఇక్కడి అటవీ లోతట్టు ప్రాంతంలోని బండిమోడుచెరువువంకలో ఇసుకను తవ్వి తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇసుక రవాణా కోసం ఏనుగుల దాడుల నిరోధం కోసం ఏర్పాటు చేసిన కందకాలను పూడ్చివేసి, అడవిలో కిలోమీటర్ల మేర రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. రెండు నెలలపాటు పొక్లెయినర్‌తో ఇసుక తవ్వకాలు జరిపి, యథేచ్ఛగా రవాణా చేశారు. ఇసుక తరలింపుపై పలుమార్లు గ్రామస్తులు ప్రశ్నిస్తే, తమకు ప్రభుత్వ అనుమతులున్నాయని చెబుతూ వచ్చారు. గ్రామస్తులు ప్రశ్నించడంతో పొక్లెయినర్ వాడకాన్ని విడిచిపెట్టి, రాత్రి వేళల్లో కూలీలచే ట్రాక్టర్లలో ఇసుక రవాణాను కొనసాగిస్తున్నారు. వారం రోజుల క్రితం నాలుగు గ్రామాల ప్రజలు అనుమానంతో అనుమతుల పత్రాలు చూపాలని ఇసుక అక్రమ రవాణాదారులను గట్టిగా నిలదీశారు. దీనిపై వారు గ్రామస్తులపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో గ్రామస్తులు రెండు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని, అటవీ అధికారులకు అప్పగించారు. కానీ దానిపై అటవీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియడం లేదు. అటవీ అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇసుకదందాకు తెరపడేదని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. వారు అక్రమ రవాణాదారులతో లాలూచీ పడటం వల్లే ఇసుకదందా నిరాటంకంగా సాగుతోందని వారు ధ్వజమెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నాలుగు గ్రామాల ప్రజలు ఇసుక తవ్వకాలు జరుగుతున్న అటవీ ప్రాంతం చేరుకున్నారు. అక్కడి నుంచి ఇసుకతో వస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను వారు అడ్డుకున్నారు. వాటిలో ఇసుక ట్రాక్టరును డ్రైవర్ వెనక్కు మళ్ళించి తీసుకెళ్ళిపోయాడు. ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారన్న విషయం తెలుసుకున్న ఇసుక దందాకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధి గ్రామస్థులను ఫోన్‌లో బెదిరించారు. అయినా వారు ట్రాక్టర్లను అక్కడి నుంచి కదలనీయలేదు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న అటవీ సిబ్బందిపై వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇసుక అక్రమరవాణాదార్లతో కుమ్మక్కై, వారికి పూర్తిగా సహకరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర వాగ్వాదాల అనంతరం ఉన్నతాధికార్ల దృష్టికి తీసుకెళ్ళి, ఇసుక అక్రమరవాణాదార్లపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని అటవీసిబ్బంది హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గ్రామస్తులు అడ్డుకున్న ట్రాక్టర్లను అటవీ సిబ్బంది ననియాల ఎలిఫెంట్ క్యాంపుకు తరలించారు.

చిత్తూరులో నేడు కె.సభా శతజయంతి సదస్సు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 3 :ప్రఖ్యాత రచయిత కె.సభా శతజయంతి సదస్సును ఆదివారం చిత్తూరు బైపాస్ రోడ్డులో గల కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవనంలో కేంద్ర సాహిత్య అకాడమీ సహకారంతో నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. రచయిత్రి కె.రామలక్ష్మి అధ్యక్షతన జరిగే ప్రారంభ సమావేశంలో సి.మృణాళిని స్వాగతోపన్యాసం చేస్తారు. కె. బాలకృష్ణారెడ్డి గౌరవ అతిథిగా పాల్గొనే ఈ సమావేశంలో రచయిత మధురాంతకం నరేంద్ర కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కిరణ్ క్రాంత్ చౌదరి అధ్యక్షతన జరిగే మొదటి సమావేశంలో కె.సభా కథాసాహిత్యంపై డి.రాజేశ్వరమ్మ, జీవితం-సాహిత్యంపై పాయసం సుబ్రమణ్యం, బాల సాహిత్యంపై పత్తిపాక మోహన్ పత్ర సమర్పణ చేస్తారు. మధ్యాహ్నం కాసిమ్ అలీ ఖాన్ అధ్యక్షతన జరిగే రెండవ సమావేశంలో కె.సభా నవలలపై జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, కవిత్వ రచనలపై పలమనేరు బాలాజీ, నాటికలపై ఎంఆర్ అరుణకుమారి పత్ర సమర్పణ చేస్తారు. సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి డి.అశోక్‌కుమార్ గౌరవ అతిథి కాగా వసపల హరికృష్ణారెడ్డి అధ్యక్షత వహిస్తారు. కె.వేణుగోపాల్ సమాపన ప్రసంగం వుంటుంది.కవులు, రచయితలు, కళాకారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.11 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.11 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 58,842 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,796 మంది తలనీలాలు సమర్పించారు. కాగా కేంద్రమంత్రి ఎల్.మురుగన్, ఎమ్మెల్యే రాంగోపాల్‌రెడ్డి, సినీనటుడు శివారెడ్డి శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎన్నికల విధుల కోసం ఉద్యోగుల వివరాలివ్వండి

కలెక్టర్ షన్మోహన్ ఆదేశం

సమీక్షలు - సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ఎన్నికల విధుల కోసం కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులందరి పూర్తి వివరాలను ఈనెల 7వ తేదిలోగా కలెక్టరేట్‌కు అందించాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఖజానా కార్యాలయం ద్వారా 34 అంశాలతో కూడిన ప్రొఫార్మాలో కిందిస్థాయి ఉద్యోగి నుంచి హెచ్‌వోడీ వరకు అందరి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఉద్యోగి సొంత జిల్లా, నియోజకవర్గం, మండల వివరాలతోపాటు ఉద్యోగుల సీఎఫ్ఎంఎస్ నెంబరు, పేస్కేల్, బేసిక్ వివరాలను అందించాలని సూచించారు. గత ఎన్నికల్లో విధులు నిర్వహించి ఉంటే అలాంటి వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. చివరగా సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందని ఉద్యోగుల వివరాలు కూడా అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 3: ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా కొత్త కార్యవర్గాన్ని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు రత్నకుమార్ ప్రకటించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ యూనియన్‌ను బలోపేతం చేసేందుకు, కొత్త సభ్యత్వ నమోదుకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని తెలిపారు. మురళీధర్ ప్రధాన కార్యదర్శిగా, రంజిత్‌కుమార్ సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతారని ప్రకటించారు.

ఓట్ల కోసమే డీఎస్సీ డ్రామా

● తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ వినూత్న నిరసన



చెవిలో కాలీఫ్లవర్స్‌తో నిరసన తెలుపుతున్న నేతలు - డీఎస్సీ నోటిఫికేషన్, క్యాబినెట్ నిర్ణయ ప్రతుల దగ్ధం



తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 3: ఓట్ల కోసమే సీఎం జగన్మోహన్‌రెడ్డి డీఎస్సీ నోటిఫికేషన్ డ్రామా ఆడుతున్నాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. శనివారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాలీఫ్లవర్ చెవిలో పెట్టుకుని, నుదుటిపై నామాలు దిద్దుకుని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. రవినాయుడు మాట్లాడుతూ నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే సీఎం డీఎస్సీ విడుదల చేశారన్నారు. నెల రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ పెట్టుకుని ఇప్పుడు డీఎస్సీ ప్రకటించడంలో ఆంతర్యమేమిటో అర్థం చేసుకోవాలన్నారు. ఏటా 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో 58వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీని ప్రకటిస్తానని చెప్పి ఐదేళ్ల మోసం ఉత్తుత్తి ప్రకటనలతో మోసం చేశారని తెలిపారు. ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని, కొందరు గంజాయి, డ్రగ్స్, మద్యానికి బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణయాదవ్, హేమంత్ రాయల్, రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ హయాంలో మూడు డీఎస్సీల ద్వారా వేలాది టీచరు పోస్టులను భర్తీ చేశారని అన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పిన జగన్ ప్రతి మాటను తప్పుతూ యువత, నిరుద్యోగుల భవిష్యత్తును నిర్వీర్యం చేశాడన్నారు. అనంతరం మెగా డీఎస్సీ నోటిఫికేషన్, క్యాబినెట్ నిర్ణయ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పీ శ్రీనివాసులు, పెరుమాల్ మధుబాబు, తోట వాసు, కరణం సందీప్, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రఫీ, శ్రీరామ్ బాబి, గోపి, దిలీప్ రాయల్, లోకేష్ రాయల్, జేడీ ప్రసాద్, గాలి పవన్, తిరుమల, యువత అధ్యక్షుడు రాఘవ, సంతోష్, నవీన్, జయకృష్ణ, వంశీ, నాగరాజు, మునిరాజా, రాజేష్, ప్రసాద్, లీలా, హరి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఏర్పేడు, ఫిబ్రవరి 3: మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక శుక్రవారం ఉదయం శ్రీకాళహస్తిలోని కళాశాలకు వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జిలాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో రహస్య విచారణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భద్రత వైఫల్యంపై నిఘా అధికారులు రహస్యంగా విచారణ చేసినట్లు సమాచారం. బాలుడు అర్ధరాత్రి ఆలయ ప్రకారం దాటడంపై ఎస్పీ పరమేశ్వర రెడ్డి స్థానిక పోలీసు అధికారులను ఆరా తీశారు. ఆ తర్వాత మతపరమైన అంశాలపై విచారించే ఇంటెలిజెన్స్ రహస్య బృందం తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి చేరుకుంది. భద్రత లోపాలపై అధ్యయనం చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సమాచారం.

అన్యమతస్థుల సేవలు అవసరం లేదు

బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): అన్యమతస్థులను తిరుమలలో శ్రీవారిసేవకు అనుమతించాలంటూ డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఓ భక్తుడు కోరిన క్రమంలో టీటీడీ ఈవో పరిశీలిస్తామని చెప్పడాన్ని ఖండిస్తున్నట్లు బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.ముస్లిం మతంలో శ్రీవారి భక్తులున్నారని, వారికి శ్రీవారిసేవ చేసుకునే అవకాశం కల్పించాలంటూ తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన హుస్సేన్ బాషా శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా కోరిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఈవో బదులిచ్చిన క్రమంలో బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి శనివారం ఓ వీడియో ద్వారా స్పందించారు. ఆ వ్యాఖ్యలను ఈవో వెనక్కి తీసుకోవాలన్నారు.టీటీడీ ఈవో ఇష్టానుసారం ప్రకటనలు చేస్తే ఎలా సరిపోతుందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అన్యమతస్థులను శ్రీవారిసేవకు వినియోగించే వీలు లేదని టీటీడీని హెచ్చరిస్తున్నామన్నారు.టీటీడీ జీతం తీసుకుంటూ కనీసం శనివారంరోజున హారతి, ప్రసాదం తీసుకోకుండా చాలా మంది అన్యమతస్థులు పనిచేస్తున్నారని, వారిని విధుల నుంచి తప్పించి ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తిరుమలలో స్వామీజీల సందడి

ధార్మిక సదస్సుకు హాజరైన పలువురు



సదస్సులో ప్రసంగిస్తున్న టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆస్థానమండపంలో శనివారం ఉదయం శ్రీవేంకటేశ్వర సనాతన ధార్మిక సదస్సు ఘనంగా ప్రారంభమైంది.మూడురోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో పలువురు మఠాధి, పీఠాధిపతులు ధర్మప్రచారం, పరిరక్షణ అంశాలపై అనుగ్రహభాషణంతో పాటు చర్చించనున్నారు. శనివారం 25మంది మఠాధి, పీఠాధిపతులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు అనుగ్రహభాషణం చేశారు.తిరుమల పెద్ద, చిన్నజీయర్ స్వాములు, వ్యాసరాజమఠానికి చెందిన భారతి శక్తిపీఠం మాతృశ్రీ రమ్యానంద, విజయవాడకు చెందిన అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి, భీమవరానికి చెందిన భాష్యకార సిద్ధాంత పీఠం రామచంద్ర రామానుజ జీయర్, శ్రీనివాసమంగాపురానికి చెందిన లలిత పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి, ఏర్పేడు వ్యాసాశ్రమానికి చెందిన పరిపూర్ణానందగిరి స్వామి, కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థ స్వామి, కడప బ్రహ్మంగారి మఠాధిపతి విరజానంద స్వామి, గుంటూరుకు చెందిన విశ్వయోగి విశ్వం, తుని తపోవనానికి చెందిన సచ్చిదానంద సరస్వతి, నెల్లూరుకు చెందిన సత్యానంద ఆశ్రమ హరితీర్థ స్వామి, విజయవాడలోని జ్ఞాన సరస్వతి పీఠానికి చెందిన ప్రకాశానంద సరస్వతి స్వామి, తేనెపల్లికి చెందిన చైతన్య తపోవనం మాతా శివనంద సరస్వతి, మాతా సుశ్రుశానంద, ప్రొద్దుటూరుకు చెందిన శివ దర్శనం మాత, ఉత్తరకాశీకి చెందిన స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, విజయవాడకు చెందిన చిదానంద ఆశ్రమం సత్యానంద భారతి, గుంటూరుకు చెందిన శైవ క్షేత్రం శివస్వామి, హైదరాబాద్‌కు చెందిన దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి శనివారం సదస్సులో పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. మఠాధి, పీఠాధిపతుల సలహాలు, సూచనలతో సనాతన హిందూ ధర్మప్రచారాన్ని మరింత గొప్పగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్టు టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి తెలిపారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ తాను గతంలో ఛైర్మన్‌గా ఉన్నప్పుడు రెండుసార్లు ధార్మిక సదస్సును నిర్వహించి స్వామిజీల సలహాలతో దళిత గోవిందం, మత్స్య గోవిందం, గిరిజన గోవిందం వంటి కార్యక్రమాల ద్వారా భగవంతుడిని భక్తుల చెంతకు తీసుకెళ్లామన్నారు. సనాతన హిందూ ధర్మప్రచారాన్ని చిత్తశుద్ధితో ప్రజలకు చేరువ చేస్తున్న టీటీడీపై అవాస్తవ విమర్శల దాడి జరుగుతోందన్నారు.తమ వైపు నుంచి ఏవైనా పొరబాట్లుంటే సవరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.సదస్సులో పాల్గొని విలువైన పలు సూచనలు, సలహాలు ఇచ్చిన పీఠాధి, మఠాధిపతులు, స్వామిజీలకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమ ప్రారంభంలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలపై ఎస్వీబీసీ రూపొందించిన వీడియోను ప్రదర్శించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ప్రశాంతంగా ముగిసిన వేలం పాటలు


వేలం పాట నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు


పలమనేరు, ఫిబ్రవరి3 : పలమనేరు మార్కెట్ యార్డులో శనివారం వి.కోట మండలం శివునికుప్పం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న మామిడి మండీల స్థలాలకు వేలం పాటలు ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 2వ తేది అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వేలంపాటలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ టీడీపీ నాయకులు వేలం పాటలను అడ్డుకోవడం విదితమే. దీనిపై శనివారం వేలం పాటలు నిర్వహిస్తామని మార్కెట్ అధికారులు ప్రకటించారు. దీని మేరకు శనివారం 44 మండీలకు స్థలాలను వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటల్లో ప్రభుత్వం ఒక్కోస్థలానికి సర్కారు పాట నెలసరి అద్దె రూ. 2200 నిర్ణయించగా వేలం పాటల్లో 2200 నుంచి రూ. 2500 వరకు వేలం పాటలు పాడి స్థలాలను లైసెన్సు కలిగిన మండీ వ్యాపారులు దక్కించుకొన్నారు. ఈ వేలం పాటల్లో కడప మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు, చిత్తూరు మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, డీఈఈ హరినారాయణ రెడ్డి, పలమనేరు మార్కెట్ అధ్యక్షులు హేమంత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి సంజీవకుమార్, వ్యాపారులు పాల్గొన్నారు.

జాతి నిర్మాణానికి మహిళలే మూలం


మాట్లాడుతున్న శతావధాని ఆముదాల మురళి

పలమనేరు, ఫిబ్రవరి3 : జాతి నిర్మాణానికి మహిళలే మూలం అని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి పేర్కొన్నారు. శనివారం తిరుపతి సమీపంలోని పుదిపట్ల వద్ద ఉన్న రామకృష్ణ సేవా సమాజం, తెలుగు సాహిత్యసాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ పునరుద్ధరణ-మహిళా శక్తి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆముదాల మురళి మాట్లాడుతూ అన్ని రంగాల్లో స్త్రీలు ఎదిగినప్పుడు దేశాభివృద్ధి సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమాజం నిర్వాహకులు రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, అచ్యుతానంద, సమితి అధ్యక్షుడు పి. తులసినాథంనాయుడు, ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సవరించండి


డీటీ త్యాగరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 3: పులిచెర్ల మండలంలోని పలు పోలింగ్‌స్టేషన్ల ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న పొరబాట్లను సంబంధిత అధికారులు సవరించాలని రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీ పరిధిలోని 257 పోలింగ్‌స్టేషన్ ఓటర్ల జాబితాలో ఉన్న స్థానికేతరుల ఓట్లను తొలగించాలని పులిచెర్ల డీటీ త్యాగరాజ్‌కు శనివారం టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పోశంవారిపల్లి పంచాయతీ 259 పోలింగ్‌స్టేషన్ పరిధిలోని 49 ఓట్లు ఎల్లంకివారిపల్లి పంచాయతీ 257 పోలింగ్‌స్టేషన్‌లో నమోదయ్యాయన్నారు. స్థానికంగా పోలింగ్‌స్టేషన్ ఉన్నా ఈ 49 ఓట్లు ఎల్లంకివారిపల్లికి మార్చడంతో 49 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కిలోమీటరు దూరం రావాల్సిఉందన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఎల్లంకివారిపల్లి ఓటర్ల జాబితాలో ఉన్న 49 ఓట్లను పోశంవారిపల్లి పోలింగ్‌స్టేషన్‌కు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపినాయుడు, మురళీధర్‌నాయుడు, దేవ, దనంజయనాయుడు, మోహన్, పరంధామనాయుడు, కేశవులునాయుడు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం పై దృష్టి : బీజేపీ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

వి.కోట, ఫిబ్రవరి 3: గ్రామ స్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆ పార్టీ పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కమార్ అన్నారు. శనివారం వి.కోటలో మండల స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. ఆపై పార్టీ ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. త్వరలో పల్లెకు పోదాం పేరిట మండల పరిధిలోని అన్ని గ్రామాలో పార్టీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమశేఖర్, బూత్ కమిటీ అధ్యక్షుడు కృష్ణా, గోపీనాథ్, రామచంద్ర, నవీన్‌కుమార్‌రాజు, పద్మనాభం, కవితరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రమణయ్య హత్య దారుణం

నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ సిబ్బంది నిరసన

శాంతిపురం, ఫిబ్రవరి 3: విజయనగరం జిల్లా కొండేపల్లె తహసీల్దార్ రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తూ శాంతిపురంలో రెవెన్యూ సిబ్బంది నిరసనకు దిగారు. శనివారం మండల సచివాలయం వద్ద విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండు చేశారు. భూవివాదాలున్న మండలాల ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు. హత్యకు గురైన తహసీల్దార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు, చేసే వారిపై కఠినచర్యలు తీసుకుని తక్షణం శిక్షించేలా చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీటీ కౌలేష్, ఆర్ఐ మధుసూధన్, వీఆర్‌వోలు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్, ఎంపీటీసీలు



కుప్పం, ఫిబ్రవరి 3: శాంతిపురం మండలం మఠంకు చెందిన వైసీపీ సర్పంచ్ మురళి, ఎంపీటీసీ చంద్ర శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పసుపు కండువాలు కప్పుకున్నారు. పార్టీ కోసం ఎంతగానో కష్టపడితే అక్కడ తమకు తగిన గుర్తింపు లేది వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ తరపున గెలిచినా పంచాయతీకి తగిన నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాలను అభివృద్ధి చేయలేక పోతున్నామని వాపోయారు. కార్యక్రమంలో శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, ఇతర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

కల్లూరు : కల్లూరు పట్టణం జగన్నకాలనీ సమీపంలోని మామిడితోటలో శనివారం పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.22250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. పీలేరుకు చెందిన ఇద్దరు పేకాట ఆడుతూ పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి బిల్లులు మంజూరు చేయండి

డ్వామా పీడీకి ప్రజాప్రతినిధుల వినతి


పీడీ గంగాభవానితో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

సోమల, ఫిబ్రవరి 3: ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు డ్వామా పీడీ గంగాభవానీకి వినతి చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో 15 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులను తనిఖీ బృందం వెల్లడించింది. కొన్ని పంచాయతీల్లోనూ రహదారుల వెంట నాటిన అవెన్యూ ప్లాంటేషన్‌లో రోడ్డు విస్తరణ పనులతో తొలగించడం జరిగిందని నివేదికల్లో వెల్లడించారు. చిన్నఉప్పరపల్లె పంచాయతీలో నాటిన రోజా మొక్కలు చనిపోవడంతో రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఉపాధి నిధులతో చేపట్టిన పలు పనులకు 9 నెలలు దాటినా రూ. 1.60 కోట్లు బిల్లులు ఇవ్వలేదని జడ్పీటీసీ కుసుమ, ఎంపీపీ ఈశ్వరయ్యలు పీడీ గంగాభవాని దృష్టికి తెచ్చారు. పీఆర్ డిపాంట్‌మెంట్‌లో చేసిన పనుల్లో రూ. 94 వేలు, ఈజీఎస్ పనుల్లో రూ. 5529 రికవరీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు ఈనెల 5లోపు నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో భాగ్యలక్ష్మి, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో దినకర్‌బాబు, ఏపీఎం శివయ్య, ఎస్ఆర్పీ మీరావలి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజీ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలి

పోలీసు అధికారులకు జడ్జి లిఖిత సూచన



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న పలమనేరు జడ్జి లిఖిత, పుంగనూరులో మాట్లాడుతున్న జడ్జి వాసుదేవరావు

పలమనేరు, ఫిబ్రవరి3 : మార్చినెలలో జరిగే జాతీయలోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారం కోసం ఇప్పటినుంచే దృష్టి సారించాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత పోలీసు అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం పలమనేరు కోర్టులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట పోలీసు అధికారులతో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవకాశాలున్న కేసుల గురించి చర్చించారు. ఈ సమావేశంలో పలమనేరు, గంగవరం సీఐలు చంద్రశేఖర్, కృష్ణమోహన్, పలమనేరు, గంగవరం ఎస్ఐలు సహదేవి, ప్రతాప్‌రెడ్డి, న్యాయవాదులు ఎల్. భాస్కర్, అరీఫుల్లాఖాన్ పాల్గొన్నారు. అనంతరం పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలోను, గురుకుల పాఠశాలల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి లిఖిత ర్యాగింగ్ గురించి, బాల్యవివాహాల గురించి, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌ల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యాహక్కు చట్టం, ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. ఈ న్యాయవిజ్ఞాన సదస్సులలో మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పుంగనూరు రూరల్ : మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు కోరారు. శనివారం కోర్టు ఆవరణలో పోలీసు అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవచ్చున్నారు. కోర్టుల్లో కేసులు నడవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులతో పాటు కుటుంబాలు వీధిన పడుతాయన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు సింధు, కార్తీక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే : గౌనివారి


పెద్దూరులో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం రామకుప్పం మండలం 89పెద్దూరు, ననియాలతాండా, నారాయణపురంతాండా, ముద్దనపల్లెల్లో టీడీపీ గ్రామవికాస సమావేశాలు జరిగాయి. 89పెద్దూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ రాక్షసపాలనకు చరమగీతం పాడి టీడీపీకి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ 2019 ఎన్నికల్లో కల్లిబొల్లి హామీలతో ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక అన్నిహామీలను గాలికొదిలేసి ప్రజల్ని మోసం చేసిందన్నారు. గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. మద్యనిషేధం అమలు చేస్తామని చెప్పి, గ్రామాల్లో వీధివీధినా బెల్టుషాపులు పెట్టి అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. నిరుద్యోగులకు ఏటా జాబ్ కేలండర్ అమలు చేసి, విరివిగా ఉద్యోగాలిస్తామని చెప్పి నిలువునా ముంచారన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో, వన్యప్రాణుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించలేదన్నారు. కుప్పంలో చంద్రబాబును అత్యధిక మెజారిటీతో ప్రజలు గెలిపించడం తథ్యమని ఆయన తెలిపారు. సమావేశాల్లో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, నేతలు రామ్మూర్తి, మనోహర్, గజేంద్ర, కామరాజనాయక్, జయశంకర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో యువతకు సముచిత స్థానం


మొట్లచేనులో తెలుగుయువత సమావేశంలో మునిరత్నం తదితరులు

రామకుప్పం, ఫిబ్రవరి 3: టీడీపీ ఆవిర్భావం నుంచి యువతకు సముచిత స్థానం కల్పించిన ఘనత టీడీపీకే దక్కిందని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం, మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం కుప్పం మండలం మొట్లచేను, అడవిబూదుగూరు, మల్లానూరుల్లో నిర్వహించిన తెలుగుయువత సమావేశాల్లో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం యువతకు ఎన్నో హామీలిచ్చి విస్మరించి మోసం చేపిందన్నారు. దీనిని గుర్తించిన పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చారన్నారు. యువతీ, యువకులు తమ భవిష్యత్ బాగుపడాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో తెలుగుయువత నేతలు చెక్కునత్తంమణి, సతీష్, సురేష్, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

రామకుప్పం మండల పరిధిలో...

మండలంలోని పంద్యాలమడుగు, పీఎంకేతాండా, బందార్లపల్లెల్లో తెలుగు యువత పంచాయతీ స్థాయి సమావేశాలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా తెలుగు యువత నియోజకవర్గ ప్రధానకార్యదర్శి శంకర్‌చలం, రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం మాట్లాడుతూ టీడీపీ పాలనలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా యువతకు విరివిగా సబ్సిడీ రుణాలు అందించిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని కార్పొరేషన్లు అలంకారప్రాయంగా మారాయని, ఎవరికీ సబ్సిడీ రుణాలు, పనిముట్లు అందలేదన్నారు. ఏటా జాబ్ కేలండర్‌తో నిరుద్యోగులందరికీ ఉద్యోగాలిస్తామని వైసీపీ ప్రభుత్వం మోసం చేపిందని వారు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో యువత భవిష్యత్ బాగుపడాలంటే తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. ఈ విషయాలను తెలుగుయువత సభ్యులు ఇంటింటా తిరిగి యువతలో చైతన్యం తీసుకురావాలని వారు కోరారు. ఈ సమావేశాల్లో నేతలు ఉమేష్‌గౌడు, రవిగౌడు, పార్థసారథి, రఘునాథరెడ్డి, మంజునాథరెడ్డి, సతీష్, అమరనాథరెడ్డి, సుధాకర్‌నాయక్, చంద్రబాబునాయక్, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టు : టీఎన్‌ఎస్‌ఎఫ్


విద్యా సదస్సులో మాట్లాడుతున్న త్యాగరాజు

కుప్పం, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని టీఎన్‌ఎస్‌ఎఫ్ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు త్యాగరాజు ధ్వజమెత్తారు. శనివారం కుప్పం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన టీఎన్‌ఎస్‌ఎఫ్ విద్యార్థి చైతన్య సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ వైసీపీ అస్తవ్యస్థ విధానాలతో రాష్ట్రంలో 120మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. అదేవిధంగా కుంటి సాకులతో 42లక్షల మంది విద్యార్థులను అమ్మఒడికి దూరం చేశారన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంటును ఎగ్గొట్టి పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. జాబ్ కేలండర్ పేరిట యువతను వంచించారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 23వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి, నాలుగున్నరేళ్ళు గడిచిన తర్వాత కేవలం 6100 పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించడం దారుణమన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్ బంగారుమయంగా ఉండాలంటే తిరిగి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. ఈ సదస్సులో టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ నేతలు సుమన్, ప్రశాంత్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

కుప్పం, ఫిబ్రవరి 3: క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మోడ్రన్ కాలనీలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తెస్తే, వైసీపీ ప్రభుత్వం దానిని విస్మరించి నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో పీ.ఎస్.మునిరత్నం, జనసేన సమన్వయకర్త డా.నరేష్, మున్సిఫల్ అధ్యక్షులు రాజ్‌కుమార్, నేతలు వెంకటేష్, గోపినాథ్, సోమశేఖర్, జాకీర్, నబి, తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3 : స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శనివారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. మద్యపానం, ధూమపానం సేవించడం, పొగాకు వాడడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వంటి కారణాలవల్ల క్యాన్సర్ వస్తుందని వివరించారు. పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా తిని, మాంసాహారాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే ఆరోగ్యకేంద్రం వద్ద స్వయం సహాయక సంఘ మహిళలకు కూడా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, జయమ్మ, భారతి పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్నపై కంచర్ల హర్షం

కుప్పం, ఫిబ్రవరి 3: మాజీ ఉప ప్రధాని అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఉపప్రధానిగా, బీజేపీ నేతగా దేశానికి, ప్రజలకు విశేషమైన సేవలందించిన అద్వానీకి భారతరత్న పురస్కారం లభించడం ఎంతో సంతోషదాయకమన్నారు. అద్వానీ నాయకత్వ లక్షణాలు, సేవాతత్పరత, దేశభక్తి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువత



కుప్పం, ఫిబ్రవరి 3: కుప్పం మండలం చెత్తనత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లెకు చెందిన పలువురు వైసీపీ యువకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ సమక్షంలో రాజా, అజిత్, మరి కొందరు పసుపు కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మణి, సతీష్, రమేష్, రాము, గణపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్ర చికిత్సాశిబిరం

పలమనేరు, ఫిబ్రవరి3 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈనెల 4వ తేది ఉదయం 10 గంటలకు ఉచిత నేత్రచికిత్సాశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకరనేత్రాలయ నేత్రవైద్యుడు మురళి పరీక్షలు నిర్వహిస్తారని, ఆపరేషన్లు అవసరమున్న వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. చెన్నై రాను పోను ఉచిత వాహన సౌకర్యం కూడా కల్పిస్తారని, కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

అన్నప్రసాదానికి కూరగాయల వితరణ



పలమనేరు, ఫిబ్రవరి3 : తిరుమలలోని వెంగమాంబ సత్రంలో నిర్వహిస్తున్న అన్నప్రసాదం కోసం శనివారం కర్ణాటక రాష్ట్రం మాలూరు నుంచి దాతలు వివిధ రకాల కూరగాయలను వితరణగా పంపించారు. పలమనేరు మండలానికి చెందిన శ్రీవారి భక్తుడు కాప్పల్లి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో మాలూరుకు చెందిన యుగంధర్‌రెడ్డి 10 టన్నుల కూరగాయలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ కార్యక్రమంలో పలమనేరుకు చెందిన సోమశేఖర్‌నాయుడు, బాబు, శ్రీకాంత్, కాప్పల్లి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

నేడు పలమనేరులో జయహో బీసీ సదస్సు

పలమనేరు, ఫిబ్రవరి3 : పలమనేరులో ఈనెల 4వ తేది ఆదివారం నిర్వహించే జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని పలమనేరు టీడీపీ అధ్యక్షుడు ఆర్బీసీ కుట్టి పిలుపునిచ్చారు. శనివారం ఆయన పలమనేరు టీడీపీ కార్యాలయంలో మాటాడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జయహో బీసీ సదస్సు కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన పార్టీనాయకులు, బీసీలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు బీసీ నాయకులు లోకేష్‌ఆచారి, వెంటరమణ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



చౌడేపల్లె, ఫిబ్రవరి3: చౌడేపల్లె తహసీల్దార్ మాధవరాజు బదిలీ కావడంతో ఆయనను ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు శనివారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల విధులలో భాగంగా ఆయన కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లనున్న నేపథ్యంలో సన్మానించారు.

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి3: పట్టణ సమీపంలోని పుంగమ్మ చెరువు మొరవ, దండుపాళ్యం మార్గంలో వెలిసిన శనేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉపవాసాలతో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కరువు

పుంగనూరు, ఫిబ్రవరి3: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించిన టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించలేదని టీడీపీ రాజంపేట పార్లమెంట్ మైనార్టీ ఉపాధ్యక్షుడు సద్దాంహుస్సేన్ ఆరోపించారు. శనివారం ఆయన టిడ్కోఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లకు కరెంట్ ఇవ్వలేదని, కనీసం తాగునీరు సౌకర్యం కల్పించకుండా లబ్దిదారులకు తాళాలు ఇచ్చి కాపురాలు ఉండాలని చెప్పడం సిగ్గుచేటుగా ఉందన్నారు. టీడీపీ పాలనలో నిర్మించిన ఇళ్లకు వైసీపీ రంగులు వేసుకుని కనీసం మౌలిక వసతులు కల్పించకపోడం దారుణమన్నారు.

నేటి నుంచి పుంగనూరులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ

పుంగనూరు, ఫిబ్రవరి3: పట్టణంలో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మైనార్టీ యువనేత సుహేల్‌బాషా, మాజీ కౌన్సిలర్ దేశాధిప్రకాశ్ తెలిపారు. హనుమంతరాయదిన్నె నుంచి ప్రారంభించి ఇంటింటా టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్లు తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి3: కట్టుకున్న భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు ... పట్టణంలోని తాటిమాకులపాళ్యంకు చెందిన ఖలదర్‌తో అదే ప్రాంతానికి చెందిన ముబీనా(33)కు 2011లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కలరు. కొన్ని రోజులుగా తనను ప్రతి రోజు అనవసరంగా వేధిస్తున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏనుగుల సంచారంతో రైతుల ఆందోళన

సోమల, ఫిబ్రవరి 3: సోమల మండలంలో సంచరిస్తున్న జంట ఏనుగులు శుక్రవారం రాత్రి పేగలవారిపల్లె సమీప చెరువు వద్ద మకాం వేసినట్లు సర్పంచు సురేంద్రరెడ్డి తెలిపారు. గ్రామస్తులతో కలసి అటవీ సిబ్బంది చెరువు వద్ద టపాసులు పేల్చడంతో అవి పొలాల వైపు మళ్లడంతో రైతులు పరుగులు పెట్టారు. ఏనుగుల సంచారంతో పొలాల వద్దనే రైతులు గుంపులుగా చేరి మంటలు వేసుకున్నారు.

టీడీపీ ఆర్థిక సాయం

శాంతిపురం, ఫిబ్రవరి 3: గుండిశెట్టిపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతప్ప మృతిచెందాడు. శనివారం గ్రామానికి చేరుకున్న టీడీపీ నేతలు మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్ బాలసుబ్రమణ్యం తదితరులు వారి కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు.

వరసిద్ధుడి చరిత్ర గ్రంథం తొలి ముద్రణకు పూజలు



వరసిద్ధుడి గ్రంథానికి పూజలు నిర్వహించి తీసుకొస్తున్న చైర్మన్, ఈవో

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి చరిత్ర గ్రంథం తొలి ముద్రణకు ఆలయంలో శనివారం అధికారులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు మాట్లాడుతూ శ్రీవరసిద్ధి వినాయక వైభవం, ఉపాసన విధానం గ్రంథం పూర్తి స్థాయిలో ముద్రించినట్లు తెలిపారు. ఈ గ్రంథం ద్వారా స్వామి భక్తులకు ఆలయ చరిత్ర తెలుస్తుందన్నారు. ఈ గ్రంథాన్ని త్వరలో భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరనున్న నెల్లేపల్లె మాజీ సర్పంచ్



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 3: మండలంలోని నెల్లేపల్లె పంచాయతీ కనికాపురానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ మన్నారయ్య టీడీపీలో చేరే విషయంపై పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డిని శనివారం కలిశారు. జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్‌తో కలిసి వెళ్లారు. టీఎన్‌టీయుసీ కార్యదర్శి లోకనాధ నాయుడు, కటికపల్లె వరదరాజులు పాల్గొన్నారు. ఇదివరకే మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్ సమక్షంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్‌తో కలిసి మాట్లాడినట్లు సమాచారం.

త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పాత్రికేయ సంఘాల నేతలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3: అర్హులైన పాత్రికేయులకు త్వరలో ఇళ్ల స్థలాలను కేటాయించే ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ షన్మోహన్ హామీ ఇచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ డైరీ 2024ను ఎస్పీ రిషాంత్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లోకనాథన్, కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం ప్రస్తావించగా కలెక్టర్ స్పందించారు. కార్యక్రమంలో ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను హత్యచేసిన వారిని శిక్షించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3: విజయనగరం జిల్లా కొండేపల్లెలో ఉంటున్న తహసీల్దార్ రమణయ్యను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేయడం దారుణమని, నిందితుల్ని వెంటనే పట్టుకుని శిక్షించాలని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం కలెక్టరేట్ ఎదుట అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఎ హుస్సేన్ నాయకత్వంలో రెవెన్యూ, ఇతర శాఖల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. కార్యదర్శి మాట్లాడుతూ ప్రజలసేవ కోసం విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడులుచేసి హత్య చేయడం శోచనీయమని అన్నారు. పోలీసులు నిందితుల్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేష్, శేషగిరిరావు, పార్థసారథి, కలెక్టరేట్ యూనియన్ నాయకులు హేమాద్రిరాజు, మధుసూదన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి టీడీపీ నేతల నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 3: చిత్తూరు రూరల్ మండలం పెద్దిశెట్టిపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ జయరాం శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు జయరాం భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. జయరాం మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దొరబాబు, గురుజాల జగన్‌మోహన్, కఠారి హేమలత, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్, జయచంద్ర నాయుడు, మోహన్‌రాజ్, రఘు, కాశి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా నిర్వహించండి

- దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన కాణిపాక క్షేత్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆలయం వద్ద నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న క్యూ కాంప్లెక్సు స్థలం, నూతన అన్నదాన భవనం ఆధునీకరణ పనులు, బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న శిల్పకళతో నిర్మిస్తున్న అన్వేటి మండపాలను పరిశీలించారు. అనంతరం త్వరలో ఆలయం వద్ద నిర్వహించనున్న మాస్టర్ ప్లాన్‌పై చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఈఈ వెంకటనారాయణతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు శివాంజనేయులు, అరవింద్, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సవరణ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించండి

చిత్తూరు, ఫిబ్రవరి 3: ఓటర్ల జాబితా సవరణ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పక్కాగా విచారణ చేపట్టాలని ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో, కమిషనర్ అరుణలు బీఎల్వోలను ఆదేశించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రధానంగా ఫారం 6, 7, 8, 8ఎ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి విచారణను తప్పనిసరిగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ సందర్భంగా సంబంధిత ధ్రువపత్రాలను కచ్చితంగా జత చేయాలన్నారు. సూపర్‌వైజరీ అధికారులు దరఖాస్తులకు జతచేసిన ధ్రువపత్రాలను సక్రమంగా పరిశీలించి, సంతకాలు చేయాలన్నారు. ప్రతి బీఎల్వో వారి పరిధిలోని ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేని జాబితాను తయారు చేయాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను జాగ్రత్తగా అప్లోడ్ చేయాలన్నారు. సీఎంఎం గోపి, సూపర్‌వైజరీ అధికారులు పాల్గొన్నారు.

అరవై ఏళ్లు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సినేషన్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 3: జిల్లాలో అరవై ఏళ్లు పైబడిన వారికి క్షయ వ్యాధి(టీబీ) రాకుండా ముందస్తుగా బీసీజీ వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. శనివారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ టీబీ రాకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇండియాలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నారని, ఇందులో భాగంగా 12 జిల్లాలను ఎంపిక చేశారన్నారు. ఏఎన్ఎంల ద్వారా ఇంటింటి సర్వే జరుగుతున్నట్లు చెప్పారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి: టీడీపీ

విజయపురం, ఫిబ్రవరి 3: గంగాధరనెల్లూరు మండలం రామానాయుడుపల్లిలో ఈనెల 6వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరయ్యే రా... కదలిరా కార్యక్రమానికి పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు తరలి రావాలని నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకులు షాజహాన్ బాషాను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయ యాదవ్, నేతలు చినబాబు, బాలసుబ్రహ్మణ్యం రాజు, మునిభాస్కర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నింద్ర: నింద్రలో నిర్వహించిన సమావేశంలో మండలం నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావాలని గాలి భానుప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు వెంకటేశులు, రవి నాయుడు, చిట్టిబాబు, పరదేశి, ప్రసన్న కుమార్, జగన్ కోడి గాలి రమేష్ నాయుడు, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: 'రా.. కదలిరా' బహిరంగ సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శనివారం చిల్లామాకులపల్లెలో ఇంటింటికీ వెళ్లి రా... కదలిరా కార్యక్రమానికి రావాలని కోరారు. నాయకులు బాలాజీ నాయుడు, నిరంజన్‌రెడ్డి, వాసు నాయుడు, దొడ్డ హేమాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు ధరణి నాయుడు, మహేంద్ర, కమల్‌నాథ రెడ్డి, శివ, గోపి, సుదర్శన్ నాయుడు, అనిల్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ జనసమీకరణ అబ్జర్వర్ రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి సురేష్ రెడ్డి పాల్గొని రా కదలి రా సభను విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ సీనియర్ నేత చెన్నకేశవులు నాయుడు, నాయకులు అనిల్‌కుమార్, చంద్రమోహన్, జయదేవ నాయుడు, మురళీ నాయుడు, సాంబశివ నాయుడు, గుర్రప్ప నాయుడు, ఐజాక్, చల్లా తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడు రవిప్రకాష్, నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, ప్రతాప్ నాయుడు, విజయ్‌కుమార్, కేశవులు నాయుడు, చిరంజీవి యాదవ్, అరుణ్‌నాథన్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

నగరి, ఫిబ్రవరి 3: టీబీ రోగులకు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని జిల్లా ఇమ్యునైసేషన్ అధికారి రవిరాజు పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని సత్రవాడలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ప్రధానమంత్రి టీబీ విముక్త్ భారత్ అభియాన్ పథకం కింద టీబీ రోగులకు శనివారం ఆయన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం నగరి ఏరియా వైద్యశాలను సందర్శించిన ఆయన అక్కడి రోగులనుద్దేశించి మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడేవారు చల్లనినీరు తాగరాదని, చల్లటి వాతావరణంలో ఉండరాదని సూచించారు. పట్టణ పరిధిలో ఎవరైనా అనధికార వైద్యశాలలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వెదురుకుప్పం: శనివారం పచ్చికాపల్లం పీహెచ్‌సీ వద్ద క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అందజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం లోపం లేకుండా ఉండేందుకు వీలుగా ఈ కిట్లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేఖ, ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి కొత్తపల్లి జట్ల ఎంపిక

గుడిపాల, ఫిబ్రవరి 3: మెసానికల్ గ్రౌండ్‌లో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో వాలీబాల్ విభాగంలో మండలంలోని కొత్తపల్లి యూత్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైంది. కబడ్డీలో పాపసముద్రం గ్రామ యువత జట్టు మొదటి స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైంది. వీరికి జడ్పీ చైర్‌పర్సన్ రమ్య బహుమతులు ప్రదానం చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

గుడిపాల, ఫిబ్రవరి 3: గుడిపాల పంచాయతీ ఇంద్రానగర్‌లో వైసీపీ సమన్వయకర్త విజయానంద రెడ్డి ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయనే ప్రారంభించారు.జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టండి

నింద్ర, ఫిబ్రవరి 3: గ్రామాల్లో ప్రవాస యోజన కింద పల్లెకి పోదాం కార్యక్రమం ద్వారా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భువనేశ్వరి తెలిపారు. మండల కేంద్రంలోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద బీజేపీ మండల అధ్యక్షులు బాలకృష్ణ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేయించాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. కేంద్ర పథకాలను లబ్ధిదారులకు వివరించాలని కోరారు. అనంతరం నింద్ర మండల మాజీ ప్రధాన కార్యదర్శి రామ్‌ప్రసాద్‌ను జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు రామచంద్ర రాజు, ఓబీసీ అధక్షులు పెరుమాల్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ మోహన్, మాజీ మండల అధ్యక్షుడు జయరాం నాయుడు, నగరి సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరమణ, మండల యువమోర్చా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు దేవా తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

కార్వేటినగరం, ఫిబ్రవరి 3: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం 100 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ సూచించారు.

కాలభైరవస్వామికి అష్టమి పూజలు

నగరి, ఫిబ్రవరి 3: నగరి పట్టణ పరిధిలోని కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం అష్టమి సందర్భంగా ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, విభూది, పన్నీరు, కొబ్బరి నీరుతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి చందనాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

విద్యుత్ ఛార్జీలు పెంచడంలో వైసీపీ నెంబర్‌వన్

- గాలి భానుప్రకాష్

నగరి ఫిబ్రవరి 3: విద్యుత్ ఛార్జీలు, డీజిల్, పెట్రోలు ధరలు పెంచడంలో వైసీపీ ప్రభుత్వం దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలుస్తుందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ విమర్శించారు. నగరి పట్టణ పరిధిలోని 10, 11 వార్డుల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి టీడీపీ ఆరు గ్యారెంటీల గురించి వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు జగన్ ఊరూరా తిరిగి ముద్దులు పెట్టి వచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను నట్టేట ముంచాడని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ బాదుడు ప్రభుత్వాన్ని సాగనంపి సైకిల్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని, అందరూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు రుక్కుం బాలాజీ, నూరుల్లా, సైదులు, తమీన్, కృష్ణారెడ్డి, బాలాజీ, ఖాదర్‌భాయ్,



భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంచుతున్న భానుప్రకాష్

జ్యోతి నాయుడు, యుగంధర్, ఆకుల అశోక్, లోకేంద్రబాబు, శ్రీధర్, సలీమ్, అల్లి ముత్తు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 3: వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అని పూతలపట్టు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ మురళీమోహన్ విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ నిరుద్యోగ యువతను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. 50,892 పోస్టులకు గాను 6,100 పోస్టులను విడుదల చేయడం సిగ్గుచేటని అన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఎక్కడా జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తని జగన్ ప్రభుత్వం ఎన్నికలముందు మెగా డీఎస్సీ ప్రకటన చేయడం దారుణమన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభకోసం ఇంటర్ పరీక్షను వాయిదా వేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు ప్రభ



మాట్లాడుతున్న మురళీ మోహన్

తేజ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మెగా డీఎస్సీ

నింద్ర, ఫిబ్రవరి 3: నిరుద్యోగులను మభ్య పెట్టడానికి ముఖ్యమంత్రి జగన్ తూతూ మంత్రంగా ఎన్నికల ముందు మెగా డీఎస్సీని విడుదల చేస్తున్నారని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ విమర్శించారు. శనివారం నింద్రలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా 25 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తానని జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నాలుగున్నర సంవత్సరాల తర్వాత 6100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులే జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

బీజేపీ నేతల హర్షం

కార్వేటినగరం, ఫిబ్రవరి 3: బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీకి భారతరత్న పురస్కారం ఇస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ట్విట్టర్ వేదికగా పంచుకోవడం పట్ల కార్వేటినగరం మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కార్వేటినగరం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర యువ మోర్చా నాయకులు నడింపల్లి యువరాజు మాట్లాడుతూ అయోధ్య కర సేవా కార్యక్రమాన్ని చేపట్టిన అద్వానీ దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సాధించిన నాయకుడని అన్నారు. మండల బీజేపీ అధ్యక్షులు రాజశేఖర్, నడింపల్లి రోహిత్, నాయకులు పాల్గొన్నారు.

6న విజ్ఞానసుధలో జాబ్ మేళా

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 3: నగరంలోని విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో ఈనెల 6న ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల అధినేత శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30కి పైగా బహుళజాతి కంపెనీలు రానున్న జాబ్ మేళాలో డిగ్రీ, బీటీఏ, బీసీఏ కోర్సులు పూర్తి చేసిన, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొన వచ్చునని తెలిపారు. నిరుద్యోగ, యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 94932 10966 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

అమరరాజా డిప్లొమా కోర్సు 8వ బ్యాచ్ ప్రారంభం



డిప్లొమా కోర్సుకు ఎంపికైన ఉద్యోగులతో అమరరాజా అధికారులు

పూతలపట్టు, ఫిబ్రవరి 3: మండలంలోని పేటమిట్టలో వున్న అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అమరరాజా డిప్లొమా కోర్సుకు 8వ బ్యాచ్ ద్వారా 50 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ కంపెనీ చీఫ్ ఆఫీసర్ నరసింహులు నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ కోర్సును రెండేళ్ల పాటు నాలుగు సెమిస్టర్‌ల్లో నాలుగు సబ్జెక్టులు (మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్)గా ఉంటాయి. ఇందులో ఉత్తీర్ణత పొందిన ఉద్యోగులకు కంపెనీలోనే సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించనున్నారు. 2015 ఆగస్టు నెలలో ఈ డిప్లొమా కోర్సులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 110 మంది ఉద్యోగులు ఆరు బ్యాచ్‌లుగా తమ కోర్సును పూర్తిచేసి పదోన్నతి పొందారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్, జనరల్ మేనేజర్ నళిని, రాజన్న ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సతీష్, మంగళ ఇండస్ట్రీస్ బిజినెస్ హెచ్‌ఆర్ మేనేజర్ రవికుమార్, ఇన్నా బిజినెస్ మేనేజర్ సునీల్ వర్మ, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్పీకి ఘన సన్మానం



కవాతు వాహనంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డిని ఊరేగిస్తున్న పోలీసులు

చిత్తూరు, ఫిబ్రవరి 3: చిత్తూరు జిల్లా ఎస్పీగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన రిషాంత్ రెడ్డికి ఆర్మ్‌డ్ పెరేడ్ మైదానంలో శనివారం వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీని ఆర్మ్‌డ్ రిజర్వుడు పోలీసులు, అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీసు ఆఫీస్ నుంచి గాంధీ కూడలి వరకు పూలు చల్లుతూ పోలీసు కవాతు వాహనాన్ని పోలీసులు లాగుతూ ఎస్పీని ఊరేగించారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్పీ మంచి నాయకత్వ, వ్యక్తిత్వం కలిగిన అధికారి అని కొనియాడారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో, పరిపాలనలో సహాయ సహకారాలు అందించిన పోలీసులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మీ, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, బాబు ప్రసాద్, శ్రీవిష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీలు మురళీధర్, ఇలియాస్ బాష, ట్రైనీ డీఎస్పీలు పావనకుమార్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంకరజాతి జెర్సీ దూడలతో అధిక లాభం



సంకరజాతి దూడకు పూజ చేస్తున్న వాసు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 3: సంకర జాతి జెర్సీ దూడలతో అధిక లాభాలు పొంద వచ్చునని పీటీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వాసు తెలిపారు. శనివారం ఎస్ఎఆర్‌పురంలో పేయ దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీటీపీ లక్ష్యాలను వివరించారు, జెర్సీ సాహివాల్... ఈ రెండిటి కలయిక వల్ల సంకరజాతి జెర్సీ ఆవులను ఉత్పత్తి చేస్తున్నారని, 2019 నుంచి దాదాపు 300 జాతి కోడెదూడలను ప్రభుత్వానికి అందించినట్లు తెలిపారు. ఈ దూడలు దేశంలో నలుమూలలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీటీపీ డిప్యూటీ డైరెక్టర్, పుత్తూరు డాక్టర్ గోవిందయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ వెదురుకుప్పం డాక్టర్ రూపసుందరి, ఎస్ఆర్‌పురం డాక్టర్ నందిని, తయ్యూరు డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ హేమ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ గుడి వార్షికోత్సవం



పూజలు చేస్తున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి చంద్రప్రకాష్ దంపతులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 3: చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్ పేటలో గంగమ్మ గుడి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి చంద్రప్రకాష్ దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారు భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు శశికర్‌బాబు, మనోహర్ నాయుడు, శీనా, చిట్టిబాబు, బుజ్జి, చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శనివారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంస్థ డైరెక్టరు శివశ్రీనివాస్ దర్శించుకున్నారు. వారిని చైర్మన్ మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు అభినందనలు



పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలుపుతున్న వెదురుకుప్పం ఎంపీటీసీ రాధిక, నాయకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 3: జీడీ నెల్లూరు నుంచి తిరిగి టికెట్ దక్కించుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామిని శనివారం వెదురుకుప్పం వైసీపీ శ్రేణులు శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలిచ్చి ఎంపీటీసీ రాధిక, వైసీపీ నేతలు పురందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, వాసు అభినందనలు తెలియజేశారు.

శ్రీరంగరాజపురం: కాగా శనివారం పుల్లూరు క్రాస్ రోడ్డులో డిప్యూటీ సీఎం నారాయణస్వామిని గజమాలతో సన్మానించారు. డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, మాజీ జడ్పీటీసీ గురవారెడ్డి, స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య, నాయకులు జనార్దన్, మణి పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలి వద్ద క్రేన్ సహాయంతో నారాయణస్వామికి గజమాలను వేశారు.

పాలసముద్రం: పాలసముద్రం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వైసీపీ నాయకులు నారాయణస్వామిని ఘనంగా సన్మానించి, టపాకాయలు పేల్చారు. జడ్పీటీసీ అన్బు, మండల వైసీపీ కన్వీనర్ తులసీరామ్ యాదవ్, నాయకులు భాస్కర్ రెడ్డి, మహేష్ నాయుడు, పోలయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

ఒక రోజు ఓటేస్తే.... ఐదేండ్లు పనిచేయాలి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 3: "ఎన్నికల్లో మీరు నాకు ఒకరోజు ఓటేసి వచ్చేస్తే.... ఆ తర్వాత నేను మీకోసం ఐదేండ్లుపాటు పనిచేయాలి" అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి వ్యాఖ్యానించారు. మూడవసారి గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే టికెట్‌ను తిరిగి దక్కించుకున్న సందర్భంగా శనివారం మధ్యాహ్నం గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్ మీటింగ్ హాలులో ఆయన కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఆరు మండలాలకు చెందిన వైసీపీ నేతలు తనకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని వైసీపీ అధిష్ఠానానికి తెలియజేసి శ్రమించి మద్దతు పలికినందువల్లే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడవసారి అవకాశం ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో నేతలు పూర్ణచంద్రారెడ్డి, చిన్నమరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, బలరామిరెడ్డి, వెంకటరెడ్డి, శంకర్‌మొదలి, యశోదారెడ్డి, కలిజవేడు సుబ్రమణ్యంరెడ్డి, మునిరాజారెడ్డి పాల్గొన్నారు.

బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయండి

పెనుమూరు, ఫిబ్రవరి 3: పెత్తందారీ వర్గాల రాజకీయ దోపిడీని అరికట్టాలని, బీసీ వర్గాల రాజకీయ భవిష్యత్తు కోసం తిరుపతిలో ఆదివారం నిర్వహించే బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు పాండు పిలుపునిచ్చారు. శనివారం పెనుమూరులో ఆయన మాట్లాడుతూ బీసీలకు 90 అసెంబ్లీ స్థానాలు, 13 పార్లమెంటు స్థానాలు అన్నీ రాజకీయ పార్టీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీల కోసం నిర్వహించే ఈ సభను బీసీలందరూ కలిసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిళామార్ట్‌లో సరుకులు కొనాలని వేధించడం సరికాదు: టీడీపీ

పెనుమూరు, ఫిబ్రవరి 3: పెనుమూరు మండలంలో మహిళామార్ట్ పెట్టి అందులో ప్రతీ డ్వాక్రా మహిళ నెలకు రూ.1000ల మేర సరుకులు కొనాలని నిబంధనలు పెట్టడం సరికాదని మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు అన్నారు. శనివారం ఈ మేరకు నాయకులతో కలిసి ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వెలుగు కార్యాలయంలో ఏపీఎంతో మాట్లాడారు. సంఘమిత్రలకు టార్గెట్‌లు ఇచ్చి వేధిస్తున్నారని, ఒంటరి మహిళలను కూడా ఉపేక్షించకపోవడం పద్ధతి కాదని అన్నారు. మార్ట్ ప్రారంభించినప్పుడు సభ్యుల వాటా రూ.25 లక్షలతో ప్రారంభించి నేడు అది రూ.కోటిపైగా టర్నోవర్ జరుగుతున్నా లెక్కలు ఎవరికి చెబుతున్నారో తెలియడం లేదని అన్నారు. దీనిపై వెంటనే జిల్లా స్థాయి అధికారులు స్పందించకపోతే తెలుగుదేశం పార్టీ తరఫున ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. టీడీపీ పార్లమెంటు కార్యదర్శి తలారి రెడ్డెప్ప, ప్రధానకార్యదర్శి భాస్కర్, శ్రీనివాసచౌదరి, ఏకాంబరం, గోపాల్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు